క్లుప్తంగా

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

ముదినేపల్లి రూరల్: పెదగొన్నూరు జెడ్పీ హైస్కూల్లో అదనపు తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సొంత ఖర్చులతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అల్పాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని హెచ్ఎం కె.ఉదయభాస్కర్ కోరారు.

విద్యుత్ మీటర్ల తనిఖీ

మండవల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆక్వా చెరువులపై ఉన్న మీటర్లను పరిశీలించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వాసు ఆధ్వర్యంలో 45 బృందాలుగా ఏర్పడి 286 సర్వీస్ మీటర్లను తనిఖీలు చేసి అదనపు లోడ్‌కు రూ.2.95 లక్షల జరిమానా విధించినట్లు గుడివాడ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ చౌర్యంపై 94408 12091, 94408 12086 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.రామయ్య పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



పమిడిముక్కల: మేడూరులో ఈస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ ఉయ్యూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీబీసీఎస్‌సీకి చెందిన నాయకులు, సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉయ్యూరు ఈస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ కార్యవర్గాన్ని సత్కరించారు. కార్యక్రమంలో పాస్టర్లు సంపత్, రాజారత్నం పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలు

పామర్రు: పేదలకు వైద్యసేవలను అందించాలని ఏపీ క్రైస్తవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సాల్మన్ కొల్లాబత్తుల అన్నారు. స్థానిక గుడివాడ రోడ్డులో సప్తగిరి బ్యాంక్ బిల్డింగ్‌లో ప్రాథమిక వైద్యశాలను మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించడమే దైవ సేవగా భావించాలన్నారు. అనంతరం ఆర్‌ఎంపీ వైద్యుడు పీ చంద్రశేఖర్ ఏర్పాటు చేసిన వైద్యశాలను ప్రారంభించారు.

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటానికి సిద్ధంకండి

గుడివాడ టౌన్: రాజ్యాంగ విరుద్ధంగా తీసుకున్న ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాటానికి సిద్ధం కావాలని జైభీమ్ పీపుల్స్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు ఉప్పులేటి దేవీ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మాల మహానాడు జేఏసీ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన గుంటూరులో జరగనున్న వర్గీకరణ వ్యతిరేకవాదుల మహాసభకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షులు మల్లెల వెంకట్రావు, అంబటి కొండలరావు, జేఏసీ నాయకులు ఎన్.బాబూరావు, జాతీయ నాయకుడు పొంగులేటి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కార్మికుడికి నష్టపరిహారం ఇవ్వాలి

గుడివాడ టౌన్: పెయింటింగ్ కార్మికుడు పామర్తి సురేష్‌కు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ఆర్.కొండ డిమాండ్ చేశారు. కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ మాట్లాడుతూ కార్మికుడు యజమాని ఇంటికి పెయింట్ వేస్తూ జారిపడి వెన్నెముకకు గాయం అయిందని ఇప్పటి వరకు బాధితునికి యజమాని నష్టపరిహారం చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికే సుమారు రూ.2 లక్షలు వైద్య ఖర్చులు అయ్యాయని తెలిపారు. సామాన్యుడు ఈ మేరకు ఖర్చులు ఎలా భరిస్తాడని ప్రశ్నించారు. యజమాని ఇప్పటికైనా స్పందించి పరిహారం చెల్లించాలని కోరారు.

14న నీటి సంఘాలకు ఎన్నికలు

పామర్రు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన నీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ జేఈఈ ఏ సాధిక్ తెలిపారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నిడిమోలు సెక్షన్ పరిధిలో మొత్తం 11 నీటి సంఘాలున్నాయని పేర్కొన్నారు. వీటికి ఈ నెల 14న నామినేషన్లు, ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. అనంతరం ఈ నెల 17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ) సభ్యుల ఎన్నిక జరుగుతుందని తెలిపారు. నీటి సంఘాల సభ్యుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. మండలంలోని లింగవరం అడ్డరోడ్డు వద్ద మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఉద్యోగుల నియామకం ఎప్పుడు?

జలవనరుల శాఖలో ఉద్యోగుల కొరత

గుడ్లవల్లేరు: కొతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలోని గుడ్లవల్లేరు, ముదినేపల్లి, గూడూరు, పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి మండలాలకు చెందిన 1.60 లక్షల ఎకరాల ఆయకట్టుకు గుడ్లవల్లేరు పుల్లేటి కాలువ నుంచి సాగునీటిని అందిస్తున్నారు. కైకలూరు, గుడివాడ సబ్ డివిజన్ల కంటే అత్యధిక ఆయకట్టు గల డివిజన్ ఇది. ఈ డివిజన్‌లో ఆయకట్టు ఎక్కువగా ఉన్నట్లుగానే సిబ్బంది కొరత కూడా ఏళ్ల తరబడి అధికంగానే ఉంది.

> ఇరిగేషన్ శాఖలో ఉద్యోగుల కొరత ఏర్పడింది. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో కొతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులకు పనిభారం పెరిగింది. అదేవిధంగా లస్కర్లు ఉండాల్సిన క్వార్టర్స్‌పై పిచ్చిమొక్కలు పెరిగి నిరుపయోగంగా మారాయి. దీంతో లస్కర్లకు గూడు కరువైంది.



గుడ్లవల్లేరు ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయం

52 మంది లస్కర్లకు గాను 14 మందే..

ఈ ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో నలుగురికి ముగ్గురు ఏఈలే ఉన్నారు. ఐసీ అసిస్టెంట్లు ఆరుగురికి ఐదుగురే ఉన్నారు. కమలాపురానికి లాకు సూపరింటెండెంట్ లేకుండా పోయారు. అదే ఎల్ఎస్‌లు కొతవరం, శేరీ దగ్గుమిల్లిలో ఉన్నారు. మూడు సెక్షన్లకు ఆరుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లకు బదులుగా ఒకే ఒక్కరు ఉన్నారు. అదీ డెప్యూటేషన్‌పై వచ్చారు. వార్ఫుకు సూపరింటెండెంట్ లేరు. లాకులు తెరిచేందుకు ఆరుగురి లస్కర్లకు బదులుగా ఒక్కరే ఉండడంతో పని ఒత్తిడికి గురవుతున్నారు. ఈ డివిజన్ మొత్తం మీద 52 మంది లస్కర్లకు గాను 14 మందితోనే పని చేయిస్తున్నారు. దీంతో వీరికి పని భారం అధికమైంది.



లాకు సూపరింటెండెంట్ భవనానికి ప్రహరీ లేక రక్షణగా పరదాలు కట్టుకున్న వైనం



1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పుల్లేటి కాలువ



క్వార్టర్ల ప్రస్తుత దుస్థితి

లస్కర్లకు గూడు కరువు

లస్కర్ల క్వార్టర్స్‌పై పిచ్చి మొక్కలు పెరిగి భవనాలు కూడా కనబడకుండా కమ్మేశాయి. రేయింబవళ్లు క్షేత్రస్థాయిలో రైతులకు సాగునీరు అందించే లస్కర్ల కుటుంబాలకు తల దాచుకునే గూడు లేక అద్దెల దరువుతో సతమతమవుతున్నారు. చివరి వ్యవసాయ భూములకు సైతం గుడ్లవల్లేరు పుల్లేటి కాలువ నుంచి 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు వైఎస్సార్ ప్రతిష్టాత్మకంగా ఆధునికీకరణ పనులను చేపడితే...ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. లాకులు, వార్ఫురోడ్డులో ఉద్యోగుల కుటుంబాలు నివాసం ఉంటున్న క్వార్టర్స్ కొన్ని గతంలోని వైఎస్సార్ హయాంలో నిర్మించారు. ఈ క్వార్టర్స్‌కు మెయింటెనెన్స్ కూడా లేక పోవటంతో సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు.

ఉన్నతాధికారులకు వినతి

మా ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నమాట వాస్తవమే. ఆ పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. ఆ పోస్టుల భర్తీ బాధ్యత ఉన్నతాధికారులదే. ప్రభుత్వం ఎప్పుడు పోస్టింగులు ఇస్తే అపుడే సాధ్యమవుతుంది. అలాగే ఆధునికీకరణలో నిర్మించిన క్వార్టర్స్ నిర్మాణం, వాటి నిర్వహణకు తర్వాత నిధులు మంజూరు కాలేదు.

– సరిపల్లి శ్రీను,
కొతవరం ఇరిగేషన్ సబ్ డివిజన్ డీఈ

పని భారం తగ్గించాలి



లస్కర్లకు పని భారం తగ్గించాలి. అలాగే ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తేనే ఇపుడు పని చేసే ఉద్యోగులకు భారం తగ్గుతుంది. అలాగే గతంలో నిర్మించిన క్వార్టర్స్‌ను పూర్తిగా పక్కన పెట్టేశారు. ఉద్యోగులకు గతంలో క్వార్టర్స్‌కు మెయింటెనెన్స్ కూడా ఇవ్వక పోవటంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

– పిడుగు దేవసహాయం,
సీపీఎం నాయకుడు,
గుడ్లవల్లేరు మండలం

సీపీఎం మహాసభను జయప్రదం చేయండి

మొవ్వ: చల్లపల్లిలో ఈ నెల 15న నిర్వహించనున్న సీపీఎం కృష్ణా జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మొవ్వ మండల మండల కార్యదర్శి శీలం నారాయణరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 15వ తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు చల్లపల్లి అమరవీరుల స్థూపం నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం చల్లపల్లి సెంటర్లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు సుంకర పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబురావు, జిల్లా కార్యదర్శి వై నరసింహారావు తదితరులు పాల్గొంటారని తెలిపారు.

బాలిక కిడ్నాప్

పోలీసులు పట్టించుకోవడం లేదంటున్న తల్లిదండ్రులు

గుడివాడరూరల్: తమ కుమార్తెను కిడ్నాప్‌కు గురై నాలుగు రోజులు గడుస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ ఆ బాలిక తల్లిదండ్రులు దుర్గారావు, ఇందిర ఆరోపించారు. పట్టణంలోని కేటీఆర్ కళాశాల సమీపంలోని ఓ అపార్టుమెంట్‌లో దుర్గారావు, ఇందిర దంపతులు మంగళవారం మీడియాతో మాట్లాడారు. తమ కుమార్తె ఓ పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రథమ సంవత్సరం చదువుతోందన్నారు. ఈ నెల 7వ తేదీ ఉదయం కళాశాలకు వెళ్లిందన్నారు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల గాలించామన్నారు. తాము నివాసముంటున్న అపార్టుమెంట్‌కు చెంది రాహుల్ కూడా అదే రోజు నుంచి కన్పించకపోవడంతో అనుమానం వచ్చి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు స్పందించడం లేదని, తమకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీని వేడుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయంపై టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్ స్పందిస్తూ బాలిక పక్క రాష్ట్రంలో ఉన్న సమాచారం అందిందని తెలిపారు. వీలైనంత త్వరగా బాలిక ఆచూకీ కనిపెడతామని పేర్కొన్నారు.

మానవ హక్కులను గౌరవించాలి

సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి

కైకలూరు: మానవ హక్కులను ప్రతిఒక్కరూ గౌరవించాలని కైకలూరు సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి పేర్కొన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా భుజబలపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం, జీవించే హక్కు, అభిప్రాయ వ్యక్తీకరణ స్వేచ్ఛ, పని, విద్యా హక్కులు వంటి సాధారణ హక్కులు ప్రతి ఒక్కరికీ ఉంటాయన్నారు. వీటికి ఎవరూ భంగం కలిగించకూడదన్నారు. పాఠశాల స్థాయిలో ఎవరైనా విద్యార్థుల ఇంటి వద్ద హింసకు గురైతే తోటి స్నేహితులు, ఉపాధ్యాయులు 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 15,100 మండల లీగల్ సర్వీసెస్ కమిటీల టోల్ ఫ్రీ నంబర్లకు తెలియజేయాలన్నారు. వివరాలు చెప్పిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.లక్ష్మీరాజేశ్వరి, న్యాయవాదులు పి.పవన్‌కాంత్, పి.ప్రసన్నకుమార్, డి.శివప్రసాద్, కానిస్టేబుల్ బి. వెంకటరావు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎన్‌వీ లక్ష్మి

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు

పమిడిముక్కల: మండలంలోని తాడంకి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 11 అర్జీలు అందాయని, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేనుగ వెంకట రమణకుమారి, ఆర్ఐ కిరణ్‌కుమార్, రీ సర్వే డీటీ యేసుపాదం పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: రైతు సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.లోకరాజు అన్నారు. మండలంలోని పెసరమిల్లిలో రెవెన్యూ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.లోకరాజు మాట్లాడుతూ తమ రెవెన్యూలో రైతులకు ఉన్న సమస్యలను తీర్చేందుకే ఈ సదస్సులను చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.శివకుమార్, మండల సర్వేయరు పర్వీన్ సుల్తానా, వీఆర్వోలు పాల్గొన్నారు.

అడ్డాడలో..

అడ్డాడ(పామర్రు): రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలపై వినతిపత్రాలు అందజేసి పరిష్కారం పొందాలని పామర్రు తహసీల్దార్ రవికాంత్ పేర్కొన్నారు. మండలంలోని అడ్డాడ గ్రామంలో మంగళవారం సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులకు తెలిపాలని కోరారు. రీసర్వే డీటీ గంగాధరరావు, ఆర్ఐ రాము, మండల సర్వేయర్ రామకృష్ణ, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతం

కైకలూరు: పామర్రు–దిగమర్రు (ఎన్‌హెచ్ 165) రహదారి విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఏలూరు జేసీ ధాత్రిరెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని భుజబలపట్నంలో విస్తరణ పనుల స్థల సేకరణలో 18 మంది రైతులకు సంబంధించి సమస్యను పరిశీలించేందుకు మంగళవారం ఆమె వచ్చారు. అదేవిధంగా సోమేశ్వరం వద్ద హైవే విస్తరణకు సేకరించే భూమి యజమాని కోర్టులో కేసు వేశారు. ఇక్కడి సమస్యపై వివరాలు జేసీ తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం జేసీ మాట్లాడుతూ గోపవరం మీదుగా గోనెపాడును కలుపుకుంటూ సోమేశ్వరం వరకు జాతీయ రహదారి విస్తరణ పనులకు 2022లో ఒకరు కాంట్రాక్టు తీసుకున్నారన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏలూరు జిల్లా పరిధిలోకి కైకలూరు నియోజకవర్గం రావడంతో పనులను పరిశీలిస్తున్నామన్నారు. ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం, నేషనల్ హైవే విజయవాడ సెక్షన్ ఈఈ జి.సంజీవరాయుడు, సర్వేయర్ రమేష్, ఆర్ఐ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

కైకలూరు: పామర్రు–దిగమర్రు జాతీయ రహదారిపై సోమేశ్వరం ఫ్లై ఓవర్‌పై చేపల మేత బస్తాలతో వెళుతున్న ట్రాక్టర్ అదుపుతప్పి మంగళవారం బోల్తా పడింది. హనుమాన్ జంక్షన్ నుంచి పెకాపవరం వెళుతూ ట్రాక్టర్ ఫ్లై ఓవర్ దిగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

కైకలూరు: పౌర హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వై.శ్రీలత తెలిపారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కాలేజీ రాజనీతి, అర్థశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు పౌర హక్కులపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయ ప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

పెదపారుపూడి: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ సురేష్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ సీతామహాలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

కలిదిండి(కైకలూరు): గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సీఐ ఎస్‌కే రమేష్ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కలిదిండి మండలం లోడిదిలంకలో తనిఖీలు నిర్వహించిన నాగేశ్వరరావు నుంచి 12 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆత్మగౌరవ చిహ్నం మరుగుదొడ్డి

పెదపారుపూడి: ప్రతి ఇంటి ఆత్మగౌరవ చిహ్నం మరుగుదొడ్డి అని ఎంపీడీఓ సీతామహాలక్ష్మి అన్నారు. పెదపారుపూడిలో ప్రపంచ మానవ హక్కులు, ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవ పురస్కరించుకుని మంగళవారం మానవహారం నిర్వహించారు. మరుగుదొడ్లు సక్రమంగా వినియోగించుకోవటం ఎంత ముఖ్యమో వివరించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో రేపు వేలం

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి ఆలయ సన్నిధిలో వివిధ హక్కులను పొందేందుకు గురువారం టెండర్ బహిరంగ వేలం పాటలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఆకుల కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో అమ్మవారి సన్నిధిలో తల నీలాలు పోగు చేసుకొనుట, స్పాట్ ఫొటోలను సొంత కెమెరాలతో తీసుకోవటం, ఖాళీ నెయ్యి, నూనె డబ్బాలు పోగు చేసుకునే హక్కులను పొందేందుకు వేలాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

భగవద్గీత గ్రంథాల పంపిణీ



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు భగవద్గీత గ్రంథాలు పంపిణీ చేశారు. స్థానిక కాకర్ల వీధిలోని ఓల్డ్ టౌన్–2 మున్సిపల్ ప్రాథమిక పాఠశాల్లో భగవద్గీత గ్రంథాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టూటౌన్ ఎస్ఐ కె. జాస్మిన్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడం వలన వారిలో భక్తిభావాలు పెంపొందుతున్నాయన్నారు. తద్వారా క్రమశిక్షణ అలవర్చుకుని సన్మార్గంలో నడుస్తారన్నారు. కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, కె.అజయ్‌కుమార్, బొగ్గారపు తిరుపతయ్య, కె. శ్రీనివాసరావు, కె. హరిబాబు, తాతారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కలిదిండి(కైకలూరు): ఆబోతుల దాడి ఘటనలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. పరసావాని పాలెంకు చెందిన పరసా ధనుంజయ (60) నవంబరు 30న కలిదిండిలో పని చూసుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా హైస్కూల్ ఎదుట రెండు ఆబోతులు కుమ్ములాడుకుంటూ ధనుంజయపై పడ్డాయి. కొమ్ములతో అతడిని కుమ్మాయి. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన ధనుంజయ విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.వేంకటేశ్వరరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మండవల్లి: ఒక సీసీ కెమెరా ఒక ఏరియాలో ఉంటే అది పది మంది పోలీసుల నిఘాతో సమానమని కైకలూరు రూరల్ సీఐ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం సీసీ కెమెరాల ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ఇంటివైపు కాకుండా వీధివైపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండవల్లి ఎస్ఐ రామచంద్రరావు, కైకలూరు రూరల్ ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

కైకలూరులో..

కైకలూరు: నేర దర్యాప్తులో సీసీ కెమెరాల పాత్ర కీలకం అని రూరల్ సర్కిల్ సీఐ వి.రవికుమార్ పేర్కొన్నారు. వదర్లపాడు బ్రాంచి సీతారామ ఫంక్షన్ హాల్లో మంగళవారం సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

జోరుగా జంగిల్ క్లియరెన్స్

మండవల్లి: స్థానిక స్టేషన్‌రోడ్డులో సర్పంచ్ మెండా ఝాన్సీ పర్యవేక్షణలో మంగళవారం జేసీబీతో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, కార్యదర్శి సాయి ప్రదీప్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

గుడివాడరూరల్: తుపాను ప్రభావం పొంచి ఉన్న నేపథ్యంలో రైతులు పంటలను కాపాడుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఏఓ బోలెం అనంత లక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కాశీపూడి, సీపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు సంభవిస్తాయన్న ముందస్తు సమాచారం మేరకు రైతులు పొలాల్లో ఉన్న పంటను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. వరి కోత కోయకూడదన్నారు. కోసిన పంట ఆరని నేపథ్యంలో కుప్పలు వేసే సమయంలో ఎకరాకు 25 కిలోల చొప్పున ఉప్పును వరి పనలపై పిచికారీ చేయాలన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ

టిడ్కో గృహ వాసులకు మౌలిక వసతులు కల్పించాలి

గుడివాడ టౌన్: టిడ్కో గృహ వాసులకు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని మహిళలు ఆందోళనకు దిగారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కాలనీలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యదర్శి పి.రజిని మాట్లాడుతూ కాలనీకి ప్రధానంగా అవసరమైన నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని భవనాలకు నీటిని నిలువచేసుకునే సౌకర్యం ఉన్నా నీటి సరఫరా చేయకపోవడంతో ప్రజలు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. ఇక పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తి దోమల దాడులతో రోగాలబారిన పడుతున్నారన్నారు. వెంటనే పురపాలక సంఘ అధికారులు దీనిపై స్పందించి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.రాణి, భారతి, జి. బుజ్జి, పి రాజేశ్వరి, ఆర్.దివ్య, టి. వీరమ్మ, డి. పద్మకుమారి, సత్యవతి, ఎస్.మేరి, లావణ్య, అనిత తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మహిళలు

వాలీబాల్ పోటీలకు మొవ్వ విద్యార్థి ఎంపిక

మొవ్వ: ఇటీవల ఎన్టీఆర్ జిల్లాలోని నున్న వ్యాయామ కళాశాల్లో జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల పోటీల్లో కృష్ణా యూనివర్సిటీ టీంకు స్థానిక వేమూరి సుందరరామయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం.అజయ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాధవి మంగళవారం తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుంచి కేరళలోని కేయూ యూనివర్సిటీ, తిరువనంతపురంలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటాడని తెలిపారు. ఈ విద్యార్థిని ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ మణి ప్రసాద్ అభినందించారు.



రూ.50 వేల ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి రూ.50 వేల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పమిడిముక్కల: వీరంకిలాకు ఎస్టీ కాలనీకి చెందిన మల్లా గౌతమ్ అనే బాలుడు ఇటీవల కాలువలో పడి మృతిచెందాడు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మంగళవారం గౌతమ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.50 వేల సాయాన్ని మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ఎం.ఫణిధూర్జటి, తహసీల్దార్ నవీన్‌కుమార్, సర్పంచ్ ముళ్లపూడి సునీత తదితరులు పాల్గొన్నారు.